

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**DEC - 2010**

సంవత్సర చందా రూ. 50/-

# బైబిలు వాక్యోపదేశకూటములు

**తేదీలు** : 2011 జనవరి 10 నుండి 13 వరకు
ప్రతిరోజు 3 పూటలు

**స్థలము** : సత్యవాణి - క్రీస్తు సంఘము
7-9-35, సాంబమూర్తి వీధి,
కుళాయి చెరువు ఎదురుగా, కాకినాడ -4.

**ప్రసంగీకులు** : అమెరికాలో ప్రఖ్యాతిగాంచిన మెంఫిస్ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో ఉపాధ్యాయులుగా పనిచేయుచున్న గొప్ప బైబిలు పండితులు మరియు ఆంధ్రలోని గొప్ప బోధకులు

**సదుపాయములు**: భోజనం, వసతి ఉచితం. గొప్ప బైబిలు అంశములను వినడానికి, నేర్చుకోడానికి ఇది మంచి తరుణం. బోధకులు, వారి సతీమణులు, సంఘ సభ్యులు రావచ్చును. మొదటి రోజు మాత్రమే 20/-రూ॥లు రిజిస్ట్రేషన్ కొరకు కట్టాలి. ప్రార్థించండి, సిద్ధపడి రండి.


బ్రదర్ రిక్కీగూటం

0884-2363722

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 31 | డిసెంబరు - 2010 | సంచిక - 5


## దేవునికి ఆమోద యోగ్యమైన ప్రార్థన
(Acceptable prayer)

ప్రార్థన అంశమును గత రెండు మూడు పాఠములలో ధ్యానించుచున్నాము. మనము చేయు ప్రార్థన దేవునికి ఆమోదయోగ్యమైనదిగా ఉండాలంటే అదెట్లుండాలో ఈ రోజు తెలిసికొందము.

మొదటిగా మన ప్రార్థన తండ్రి యైన దేవుని సంబోధిస్తు యుండాలి. ఒక్కడే మీ తండ్రి, ఆయన పరలోకమందున్నాడు అని యేసు ప్రభువు బోధించారు (మత్తయి 23:9). అందువలన యేసు తన శిష్యులకు ఒక మాదిరి ప్రార్థనను నేర్పుచు "పరలోక మందున్న మా తండ్రీ !" యని ఆ ప్రార్థనను ఆరంభించారు (మత్తయి 6:9). అపో.పౌలు ఎఫెసీ 5:20లో, "మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట సమస్తమును గూర్చి తండ్రి యైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" యని చెప్పాడు, గనుక మన ప్రార్థనలు తండ్రియైన దేవునికే సమర్పించాలి గాని, యేసు తల్లియైన మరియకు కాదు. ఆమె మానవ మాత్రురాలే.

మన ప్రార్థన క్రీస్తు నామమున చేయబడాలి. ఏలయనగా "దేవుడొక్కడే. దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే;

ఆయన క్రీస్తు యేసను నరుడు (1తిమోతి 2:5). మనము చేయు ప్రార్థన దేవుని సన్నిధానము నకు చేరాలంటే, అది యేసుక్రీస్తు ద్వారా పంపబడాలి. "మీరు నామమున దేని నడుగుదురో తండ్రి కుమారుని యందు మహిమ పరచబడుటకై దానిని చేతును. నా నామమును మీరు నన్నేమి అడిగినను నేను చేతును" అని యేసు ప్రభువు చెప్పారు (యోహాను 14:13,14). "మరియు మాట చేతగాని, క్రియ చేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి" యని అపొ.పౌలు చెప్పాడు (కొలస్స 3:17).

తరువాత మనము విశ్వాసముతో ప్రార్థించాలి. "మీరు ప్రార్థన చేయునప్పుడు వేటిని అడుగుదురో అవి దొరికినవని నమ్మిన యెడల మీరు వాటినన్నిటిని పొందుదురని" ప్రభువు చెప్పారు (మత్తయి 21:22). ప్రార్థన చేయువాడు ఏ మాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెనని యాకోబు చెప్పాడు (యాకోబు 1:5,7).

తరువాత, మనము చేయు ప్రార్థన దేవుని చిత్త ప్రకారముండాలి. భూమి మీద దేవుని చిత్తము నెరవేరుటకు ప్రార్థన ఒక సాధనమై యున్నది గాని ప్రార్థన మానవుని చిత్తము పరలోకములో నెరవేరుటకు సాధనము మాత్రము కాదు. "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తాను సారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే" యని భక్తుడైన యోహాను వ్రాసాడు (1 యోహా 5:14).

మనము సదుద్దేశము కలిగి ప్రార్థించాలి. అంటే మనం అడిగేది మన స్వకీయ దురుద్దేశము కొరకు గాక, దేవుని చిత్తము నెరవేరునట్లును ఆయన పని విస్తరించ గల్గునట్లును ప్రార్థించాలి. "మీరాశించు చున్నారుగాని మీకు దొరుకుట లేదు..... మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీకేమియు దొరుకుటలేదు" అని యాకోబు హెచ్చరించాడు (యాకోబు 4:2,3).

మన ప్రార్థన సత్యవాక్యము ననుసరించి యుండాలి, ఆత్మతో ప్రార్థించాలి. అంటే మనం చెప్పుమాటలను మనం అర్థము చేసికొని ప్రార్థనలో పలకాలి. ఒకవేళ బహిరంగ ప్రార్థన చేయుచున్నయెడల, అంటే సంఘారాధన లో గాని, ఏదైనా కూటములలో గాని ప్రార్థించుచున్నయెడల అందరికీ అర్థమ య్యేలాగున, వినబడే లాగున ప్రార్థించాలి, తరువాత మనం విసుగక నిత్యము ప్రార్థించాలి.

ప్రార్థించువాడు పవిత్ర హృదయము కలిగి యుండాలి. "కావున ప్రతి స్థలమందును పురుషులు కోపమును

సంశయమును లేనివారై పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెనని కోరుచున్నానని" అపో. పౌలు వ్రాసాడు (1 తిమో 2:8). "ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడు చేయువారికి విరోధముగా ఉన్నది" (1 పేతురు 3:12).

ప్రార్థించువాడు దేవునికి ఆయన వాక్యానికి విధేయుడైన వాడై యుండాలి. ఏలయనగా "దేవుడు పాపుల మనవి ఆలకింపడని యెరుగుదుము ఎవడైనను దైవభక్తుడై యుండి ఆయన చిత్తము చొప్పున జరిగించిన యెడల ఆయన వాని మనవి నాలకించును" (యోహాను 9:31). "మరియు మన మాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక మనవేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును" (1 యోహాను 3:22). ప్రార్థించువాడు తన్నుతాను తగ్గించుకోవాలి. ప్రార్థించుటకు దేవాలయమునకు వెళ్లిన సుంకరి దూరముగా నిలుచుండి, ఆకాశమువైపు కన్నులెత్తుటకైనను ధైర్యము చాలక రొమ్ము కొట్టుకొనుచు -దేవా పాపినైనన్ను కరుణింపుమని పలికాడు (లూకా 18:13,14). అట్టివాని ప్రార్థన దేవునికి ఆమోద యోగ్యమైనది.

అయితే ఒక్కోసారి మన ప్రార్థనలకు ఆటంకముకలుగవచ్చును! మీ ప్రార్థనలకు అభ్యంతరము కలుగకుండునట్లు జ్ఞానము చొప్పున మీ భార్యలతో కాపురము చేయుడి యని అపో. పేతురు పురుషులను హెచ్చరించాడు (1 పేతురు 3:7). మన ప్రార్థనలకు అభ్యంతరము ఎప్పుడు కలుగుతాది? నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును అని భక్తుడైన దావీదు పలికాడు (కీర్తన 66:18). "రక్షింప నేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచ కాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు, మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను" అని ప్రవక్త యైన యెషయా పలికాడు (యెషయా 59:1,2).

మనము దేవుని వాక్యమును విననొల్లని యెడల మన ప్రార్థనను దేవుడాలకింపడు. "ధర్మశాస్త్రము వినబడ కుండ చెవిని తొలగించుకొనువాని ప్రార్థన హేయము" (సామె 28:9). మన స్వకీయ దురాశల కొరకు ప్రార్థించిన అట్టి ప్రార్థనను దేవుడాలకింపడు (యాకోబు 4:3). మన హృదయములో ఈర్ష్య, ద్వేషము మొ॥నవి పెట్టుకొనినను మనం చేయు ప్రార్థన వ్యర్థమే. "మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు

మనుష్యుల అపరాధములను క్షమింపక పోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు" అని యేసు ప్రభువు బోధించారు (మత్త 6:14,15). మనము ప్రార్థించునప్పుడు సందేహింపక దేవుని అడగాలి.

యాకోబు ఇట్లు చెప్పుచున్నాడు: "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా యున్న యెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగ దయచేయువాడు, అయితే అతడు ఏ మాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను. సందేహించువాడు గాలిచేత రేపబడి యెగిరిపడు సముద్రతరంగమును పోలి యుండును. అట్టి మనుష్యుడు ద్విమనస్కుడై తన సమస్త మార్గముల యందు అస్థిరుడు గనుక ప్రభువువలన తనకేమైనను దొరకునని తలంచుకొనరాదు" (యాకోబు 1:5-8).

## క్రీస్తు చనిపోయి మరల తిరిగి లేచెనా?
## (Did Christ Die and Rise again ?)

దేవుని యందు విశ్వాసముంచుట అంటే అద్భుతముల యందు విశ్వాసముంచుట, మరియు క్రీస్తు యొక్క పునరుత్థానము యందు విశ్వాసముంచుటయే. దేవుడు ఉంటే, ఆయన ఈ విశ్వాన్నీ, ప్రకృతి సూత్రములను సృష్టించి యుంటే, ఆయన జీవాన్ని సృజించితే ఆయన మృతులను సయితము లేపునని విశ్వసించుట న్యాయ సమ్మతమే. జీవమును సృజించుట ఆదిలో ఎంత కష్టమో, ప్రాణమును తిరిగిపోయుట కూడ అంతే కష్టము. యేసుక్రీస్తు యొక్క పునరుత్థానము జీవన్మరణములపై దేవుని సార్వభౌమాత్వాన్ని గుర్తుచేయుచున్నది.

యేసుక్రీస్తు జీవితం, మరణం సమాధి, పునరుత్థానములను వివరించుటకు అనేక ప్రయత్నాలు జరిగినవి.

సందేహశీలు అద్భుతములు అసాధ్యములని ముందే నిర్ణయించు కొనడం వలన, రుజువులు సమర్పించ బడినను వాటిని నిరాకరించుటకు నిశ్చయించు కొనినందు వలన ఈ అంశాన్ని మూత వేయబడిన మనస్సుతో చూసారు. యేసు శిష్యులు ఆయన శరీరాన్ని దొంగిలించి ఆయన సజీవుడైయున్నారని అబద్ధమాడారని కొందరు చెబుతారు. మరికొందరు యేసు స్పృహకోల్పోయెనని, సమాధిలో యుంచబడగా చల్లని వాతావరణానికి స్పృహ తిరిగి రాగా బయటికి వచ్చారని చెబుతారు. ఇంకా కొందరు, అపొస్తలులు మతి భ్రమించుట చేత ఏవేవో చూచారని చెబుతారు. యేసు భారత దేశమునకు పారిపోయెనని, ఆయనను పోలిన వానినెవనినో యూదులు సిలువ వేయించారని ఇంకా

కొందరు చెబుతారు.

యేసు చనిపోయి మరల తిరిగి లేచెనని నమ్మనొల్లని వారు బైబిలు రికార్డును కించపరచబడానికి ఏమైనా చెబుతారు, చేస్తారు. అయితే మంచి మనసుతో సత్యమును వెదకు వానిని దాని తాలూకు రుజువులు ఎక్కడికి నడిపిస్తాయి?

**యేసు మరణము యొక్క రుజువు :**

యేసు ఒక సిలువపై మరణించారన డానికి నాలుగు ప్రాముఖ్య రుజువులు న్నాయి. క్రొత్త నిబంధనను బట్టి, మొదటిగా యేసు తన సిలువ మరణాన్ని గూర్చి ముందుగనే ప్రవచించారు. ఫిలిప్పయిలోని కైసరయలో ఆయన తన శిష్యులతో, "మనుష్య కుమారుడు బహుశ్రమలు పొంది పెద్దల చేతను, ప్రధాన యాజకుల చేతను విసర్జింపబడి, మూడవ దినమున తిరిగి లేచుట అగత్యమని" చెప్పెను (లూకా9: 22).

తదుపరి యేసు పన్నెండు మంది శిష్యులను పిలుచుకొని, "మనము యెరూషలేమునకు వెళ్లుచున్నాము; మనుష్య కుమారుడు ప్రధాన యాజకులకును, శాస్త్రులకును అప్పగింపబడును; వారాయన ను అపహసించి, ఆయన మీద ఉమ్మివేసి కొరడాలతో ఆయనను కొట్టి చంపెదరు; మూడు దినములైన తరువాత ఆయన తిరిగిలేచునని చెప్పెను" (మార్కు 10:33, 34). యోహాను 12:23,33 ను కూడ చూడుము.

**రెండవదిగా :**

యేసు సిలువ మరణాన్ని క్రొత్త నిబంధన స్పష్టముగా వర్ణించుచున్నది. లూకా ఇట్లు వ్రాసాడు: "వారు కపాలమన బడిన స్థలమునకు వచ్చినప్పుడు అక్కడ కుడివైపున ఒకనిని ఎడమవైపున ఒకనిని ఆ నేరస్థులను ఆయనతో కూడ సిలువ వేసిరి" (లూకా 23:33). ఆరోజు రమారమి మధ్యాహ్నం మూడు గంటలకు "యేసు గొప్ప శబ్దముతో కేక వేసి తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను అనెను. ఆయన యీలాగు చెప్పి ప్రాణము విడిచెను" (లూకా 23:46). మత్తయి 27:35-50 కూడ చూడుము.

**మూడవదిగా :**

యేసు యొక్క సిలువ మరణాన్ని చూచిన సాక్షులున్నారు. "శతాధిపతియు, అతనితో కూడ యేసునకు కావలియున్న వారును భూకంపమును, జరిగిన కార్యములన్నిటిని చూచి, మిక్కిలి భయపడి నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి. యేసునకు ఉపచారము చేయుచు గలిలయ నుండి ఆయనను వెంబడించిన అనేక మంది స్త్రీలు అక్కడ దూరము నుండి చూచుచుండిరి. వారిలో మగ్దలేనే మరియయు, యాకోబు యోసే అను వారి తల్లియైన మరియయు, జెబెదయి కుమారుల తల్లియు ఉండిరి" (మత్త 27:54-56). యేసు యొక్క తల్లియైన మరియ కూడ అక్కడ వుండెను. యేసు తన

తల్లియు, తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచుండుట చూచి - అమ్మా యిదిగో నీ కుమారుడు అని తల్లితో చెప్పెను. తరువాత శిష్యుని చూచి యిదిగో నీ తల్లి అని చెప్పెను" (యోహాను 19:26-27).

**నాల్గవదిగా :**

యేసు సిలువ మరణమును గూర్చిన చారిత్రాత్మక అన్వయములు కలవు. బబులోనీయుల తాల్మడ్‌గ్రంధము, సేన్‌హెడ్రిన్ 43ఎ లో ఇట్లు చెప్పుచున్నది : "పస్కా పండుగ సాయంకాల మున జేషు (యేసు) (సిలువపై) వ్రేలాడదీయ బడెను". రోమీయుల చరిత్ర కారుడగు కొర్నేలియస్ టేసిటస్ అనుసతడు Annals గ్రంధము 15:44లో "క్రీస్తు అను మనుష్యుడు పాలస్తీనాలో సిలువ వేయబడెను" అని వ్రాసాడు : యేసు సిలువ వేయబడుట ద్వారా చంపబడెననుటకు సంశయము యేమీ లేదు.

**యేసు పునరుత్థానము యొక్క ఋజువు :**

"మూడు దినములైన తరువాత యేసు మరణముసుండి తిరిగి లేచెనా? యనుననది ప్రాముఖ్యమైన ప్రశ్న. దేవుడు యేసును మృతులలో నుండి లేపెననుటకు మూడు ప్రాముఖ్యకారణములన్నాయి. 1) ఖాళీ సమాధి 2) పునరుత్థానము తరువాత ఆయన కన్పడిన దృశ్యములు 3) క్రైస్తవ్యము యొక్క ఆరంభము.

**ఖాళీ సమాధి :**

పునరుత్థాన ఋజువులను పరిశీలించిన తరువాత క్రొత్త నిబంధన పండితులందరు ఖాళీ సమాధిని ఒక చారిత్రాత్మక ఋజువుగా ఎంచుచున్నారు. ఇట్టి యభిప్రాయమునకు అనేక కారణములున్నాయి.

1. సమాధిఖాళీగా లేకపోతే అపొస్తలులెవ్వరు యేసు మరణము నుండి తిరిగి లేచెనని నమ్మరు. శారీరక పునరుత్థానము లేకుండా ఆత్మీయ పునరుత్థానము కలుగునని మొదటి శతాబ్ధపు యూదులెవ్వరు విశ్వసించే స్థితిలో లేరు.

2. అపొస్తలులు పునరుత్థానమును కల్పించినట్లయితే వారిని నమ్మేవారు ఎవరు లేరు. క్రీస్తు శరీరము కనబడకపోతే యేసు మరణము నుండి తిరిగిలేచెనని అపొస్తలులు యూదులను నమ్మించలేక పోవుదురు.

3. సమాధి ఖాళీగా యుంటే, యూదుల అధికారులు యేసు శరీరమును ప్రదర్శించి అపొస్తలుల వంచనను బహిరంగము చేసి యుందురు. యేసు శరీరమునుంచిన సమాధి యొక్క స్థలాన్ని యూదులు, ఆయన శిష్యులు కూడ ఎరుగుదురు. యేసు శరీరము ఆ సమాధిలో యుంటే ప్రధాన యాజకులు దానిని స్వాదీనము చేసికొనడం తేలికయే. గాని వారట్లు చేయలేదు. సరిగదా కావలివారు నిద్రించుచుండగా యేసు శిష్యులు వచ్చి దానిని ఎత్తుకొని పోయారని చెబుతు సమాధి ఖాళీగా యుండడానికి వివరణ యిచ్చుటకు

ప్రయత్నం చేసారు.

**4.** పౌలు యొక్క సాక్ష్యమే ఖాళీ సమాధి యొక్క చారిత్రాత్మకతను బలపరచుచున్నది. 1 కొరింధీ 15:3-8లో పౌలు వ్రాసిన ఆదిమ క్రైస్తవ విశ్వాస ప్రమాణములో ఖాళీ సమాధి యొక్క పలు కారణాలున్నవి. "ఆయన లేపబడెను" అను మాటలలో ఆయన శరీరము లేపబడెనని ఆదిమ యూదా క్రైస్తవులు విశ్వసించిరి. మూడవ దినమున అనే మాటలలో ఖాళీ సమాధి కనుగొనబడిన సమయం ఇమిడియున్నది. పునరుత్థాన ఘట్టాన్ని నిజానికి ఎవరు చూడ లేక పోయినను, అది మూడవ దినమున సంభవించెనని ఎట్లు చెప్పుట కవకాశము కలిగెను? ఎందువలననగా, ఆ దినముననే – స్త్రీలు ఖాళీ సమాధిని కనుగొనిరి !

**5.** ఖాళీ సమాధిని స్త్రీలు కనుగొనినందున, క్రొత్త నిబంధన చెప్పురికార్డు నమ్మదగినదే. ఆ రోజులలో సాంఘికముగా స్త్రీలు అట్టడుగున యున్నవారు. మరియు న్యాయ స్థానములలో వారి సాక్ష్యము విలువ లేనిదిగా ఎంచబడేది. ఏదైనా చారిత్రాత్మక సంఘటనకు స్త్రీలు గాక, పురుషులే సాక్షులుగా ముందుంటారు. అయితే పునరుత్థానమునకు స్త్రీలే మొట్ట మొదటి సాక్షులగుట వలన సువార్తల లేఖకులు వాస్తవములనే రికార్డు చేసారు.

**పునరుత్థానము తరువాత ఆయన ప్రత్యక్షతలు :**

1 కొరింధీ 15:3-8లో ఆదిమ క్రైస్తవుల యొక్క విశ్వాస ప్రమాణమును పౌలు వ్రాసాడు. దానిని బహుశ అతనికి అపొస్తలులు వివరించి యుందురు. అది యేసు మరణించిన అయిదు సంవత్సరములలోపే అతనికి తెలియజేయబడెను. ఈ లేఖన భాగములో యేసు తిరిగి లేచిన తరువాత అగుపడిన సందర్భములను కట్టుకధలని మనం త్రోసి పుచ్చరాదు. పునరుత్థానుడైన క్రీస్తు మొదట పేతురుకు, తరువాత పండ్రెండుగురికి, అటుపిమ్మట ఐదువందలకు పైగా సహోదరులకు ఒక్క సమయమందే కనబడెను. వారిలో అనేకులు అప్పటికి బ్రదికే యున్నారు. తరువాత ఆయన యాకోబుకును, అపొస్తలులందరికిని కనబడెను. ఈ విశ్వాస ప్రమాణాన్ని పండితులు చదివే కొలదీ అది వాస్తవ చరిత్రపై ఆధారపడినదని వారు ఎక్కువ నమ్ముచున్నారు.

పునరుత్థానము తరువాత క్రీస్తు కనబడిన సందర్భములు కట్టు కథలేయని కొందరు ఇంకా చెబుతారు. అయితే ఎంత నిశిత చరిత్ర కారులైనను, కట్టుకథలు వ్యాప్తి చెందడానికి రెండు శతాబ్ధముల సమయం స్వల్పమేయని చెబుతారు. సువార్తలు, పౌలు వ్రాసిన పత్రికలు అన్నీ ప్రత్యక్షసాక్షులు జీవిత కాలంలోనే వ్రాయబడ్డాయి. వారేమైనా తప్పు వ్రాస్తే వెంటనే సవాలు చేసి యుండేవారు.

**క్రైస్తవ్యము యొక్క ఆరంభము :**

యేసు మృతులలోనుండి లేచెనని ఆదిమశిష్యులు విశ్వసించారని సందేహ

శీలురు కూడ ఒప్పుకొంటారు. యేసు పునరుత్థానుడయ్యారని అపొస్తలుల గనుక నమ్మకుంటే, క్రైస్తవ్యము ఆరంభమయ్యేదే కాదు.

యేసు మరణము నుండి తిరిగి లేచారని ఆదిమ క్రైస్తవులు ఏల విశ్వసించారు? వారి విశ్వాసము యొక్క ఆరంభాన్ని మనం ఎట్లు వివరించగలము? క్రైస్తవ ప్రభావముల వలన వారు పునరుత్థానాన్ని విశ్వసించారా? కానే కాదు. అపొస్తలుడైన పేతురు, మిగతా అపొస్తలులు పెంతెకొస్తునాడు యేసు యొక్క మరణ సమాధి పునరుత్థానమును ప్రకటించే వరకు క్రైస్తవ్యము ఆరంభము కానేలేదు. (అపొ.కా. 2).

పునరుత్థానుడైన క్రీస్తుసందున్న వారి విశ్వాసము యూదుల ప్రభావము వలన కలిగెనా? కానేకాదు. కాలాంతమందు, తీర్పునాడు మనుష్యులందరు లేపబడుదురనే యూదులు నమ్మారు (యెహెజ్కేలు 37; యెష 26:19; దానియేలు 12:2). పాతనిబంధన కాలములోను, యేసు జీవించిన కాలము లోను కూడ చనిపోయిన వారు బ్రదికింపబడిన కొన్ని సంఘటనలున్నాయి. గాని అట్టివారు మరల చనిపోయారు. చనిపోయిన నీతిమంతులు కాలాంతమందు లేపబడుదురు, గాని చరిత్ర మధ్యలో కాదని యూదులు నమ్మారు. అందువలన యూదుల ప్రభావమును బట్టి ఆదిమ క్రైస్తవులు క్రీస్తు పునరుత్థానమందు విశ్వసించలేదని చెప్పుట సమంజసమే.

యేసు నిజముగా మృతులలో నుండి లేచెనని, అనేక మందికి కనబడెననే వాస్తవములను బట్టియే ఆదిమ క్రైస్తవులు యేసుయొక్క పునరుత్థాన మందు విశ్వాసముంచిరి.

యేసు నిజంగా మృతులలోనుండి లేవలేదని ఎవరైనా చెప్పుచున్నట్లయితే అట్టివారు క్రైస్తవ్యము ప్రపంచమంతా త్వరితగతిని వ్యాపించుటను ఎట్లు వివరించగలరు? పునరుత్థానము లేకుండా, సంఘము యొక్క ఉనికిని వివరించే న్యాయ సమ్మతమైన కారణం యేమీ లేదు.

తదుపరి యేసు పొందిన కొరడా దెబ్బలు, ఘోరమైన హింస, సిలువ శిక్ష, ప్రక్కలో బల్లెపుపోటు వగయిరాలను బట్టి తరువాత ఆయన బ్రదికియుండుట అసంభవమని వైద్య నిపుణులందరు చెబుతారు. కొనప్రాణముతోనే సమాధిచే యబడి ఆయన స్పృహనొంది బయటికి వచ్చుట దుస్సాధ్యము. అంతమంది శిష్యులు, అపొస్తలులు ఒకే సంగతిని భ్రమ రూపముగా చూచుట కూడ అసంభవమని మానసిక శాస్త్రజ్ఞులు, వైద్య నిపుణులు చెబుతారు. అందువలన శిష్యులు పునరుత్థానము సంభవించినదని మతి భ్రమించి చెప్పారనడం ఏమంత సరికాదు.

ఖాళీ సమాధి, యేసు పునరుత్థానుడైన తరువాత అనేకులకు అగుపడుట, క్రైస్తవ్యము యొక్క ఆరంభము, ఇవన్నీ ఒకే సంగతిని సూచించుచున్నాయి. యేసు మృతుల లోనుండి లేచారు!!.

## క్రీస్తు సువార్త యేమిటి?
## (What is the Gospel of Christ?)

క్రొత్త నిబంధన యొక్క ముఖ్యాంశము అంతా సువార్తయే. ఈ అంశముపై ప్రతి పేజీలోను మనకు సమాచారం లభిస్తాది. సూక్ష్మంగా చెప్పాలంటే యేసు క్రీస్తు సువార్త శుభవార్తయే. అది ఆయనను గూర్చిన మంచివార్త. ఈ రోజుల్లో అన్నీ దుర్వార్తలే. గనుక యేసు క్రీస్తును గూర్చిన శుభవార్త విశ్వవ్యాప్తముగా ప్రకటించబడుట అవుసరం.

మానవుడు పాపియై మరణమునకు పాత్రుడే అయినను. దేవుడు మానవుని ప్రేమించి రక్షణను అనుగ్రహించెననునది శుభవార్త. "అందరును పాపము చేసి దేవుడనుగ్రహించుమహిమను పొందలేక పోవుచున్నారని" పౌలు హెచ్చరించాడు (రోమా : 3:23). మరియు పాపమువలన వచ్చు జీతము మరణమని అతడు హెచ్చరించాడు (రోమా 6:23). "అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" అనుమాటల వలన ఆదరణ లభించును. "కాబట్టినమ్ము వారు ఆయన కృప చేతనే. క్రీస్తు నందలి మిమోచనము ద్వారా ఉచితముగా నీతి మంతులని తీర్చబడుచున్నారు" (రోమా 3:24). దేవుని యొక్క ఆశ్చర్యకరమైన కృప నిజముగా సువార్త యే.

క్రీస్తు యొక్క మరణము, సమాధి, పునరుత్థానముల వాస్తవములు సువార్త యొక్క ముఖ్యాంశములు. అపొ. పేతురు పెంతెకోస్తు నాడు మొట్టమొదటి సువార్త ప్రసంగము చేయుచు, "దేవుడు నజరేయుడగు యేసు చేత అద్భుతములను మహత్కార్యములను సూచక క్రియలను మీ మధ్యను చేయించి, ఆయనను తన వలన మెప్పుపొందిన వానిగా మీకు కనబరచెను" అని చెప్పెను (అపొ.కా. 2:22). ఆయన చంపబడినను, మరణము ఆయనను బంధించి యుంచలేకపోయెను. "ఈ యేసును దేవుడు లేపెను! " (అపొ.కా. 2:32). "మీరు సిలువ వేసిన ఈ యేసునే దేవుడు ప్రభువు గాను, క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసి కొనవలెనని చెప్పెను" (2:36). ప్రజలు ఈ మాటల వలన హృదయములో నొచ్చుకొని

సహోదరులారా, మేమేమి చేయవలెనని పేతురును, మిగిలిన అపొస్తలులను అడిగిరి. పేతురు - "మీరు మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు. ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును దూరస్థులందరికిని అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచిన వారందరికిని చెందునని చెప్పెను" (అపొ.కా. 2:38- 39).

క్రీస్తు సువార్త అందరికీ. క్రీస్తు సంఘములో యూదులు, అన్యజనులు కూడ యుంటారు. సువార్త విన్నావారు కదలించ బడ్డారు. అతని వాక్యము అంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి. ఆదినమందు ఇంచుమించు మూడు వేలమంది చేర్చబడిరి (అపొ.కా. 2:41). అనేకులు చేర్చబడుచున్నందున సంఘము త్వరితముగా అభివృద్ధి జెందెను (అపొ.కా. 2:47).

**క్రీస్తు ఇట్లు ఆజ్ఞాపించారు:**

"మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి, తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏ యేసంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:19,20).

-బాబ్ప్రిచర్డ్

## దేవుడు సజీవుడు!
## (God Lives)

పరమందొక దేవుడున్నాడు. అది మనకెట్లు తెలుసు? ఏలయనగా ఆయన సజీవుడై యున్నాడు ! ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించుటకు దేవుడు మోషేను పంపినప్పుడు. "నేను ఉన్నవాడను అనువాడనై యున్నానని మోషేతో చెప్పెను. మరియు ఆయన ఉండునను వాడు మీ యొద్దకునన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెననెను" (నిర్గమ 3:14).

ఉన్నవాడను (I am) అనునది ప్రస్తుతము ఉన్నా ఒక వ్యక్తి యొక్క

ఏకవచనము. ఉండునను వాడసుటలో అయన ఎల్లప్పుడు ఉన్నవాడని యర్థము. ఇంకోమాటలో సజీవుడై ఎల్లవేళలా యున్న దేవుడు మోషేను ఇశ్రాయేలీయుల యొద్దకు పంపెను.

**సజీవుడైన దేవుడు :**

సజీవుడైన దేవుడు అనుపదమును బైబిలు లేఖకులు తరుచు వినియోగించారు. దానియేలు జీవముగల దేవుని సేవకుడని పిలువబడెను (దానియే 6:20). అంటే కర్ర, రాయి, లోహముతో చేయబడి మృతమైన దేవుండ్లకు భిన్నమైన జీవముగల దేవుని సేవకుడు దానియేలు. రాజగు దర్యావేషు లోకమంతట నివసించు సకల జనులకును రాష్ట్రములకును ఆయాభాషలు మాటలాడు వారికిని ఈ లాగు వ్రాయించెను: "నారాజ్యములోని సకల ప్రభుత్వముల యందుండు నివాసులు దానియేలు యొక్క దేవునికి భయపడుచు ఆయన సముఖమున వణకుచుండవలెను. ఆయనే జీవుము గల దేవుడు. ఆయనే యుగయుగములుండు వాడు" (దాని 6:25,26). "జీవము గల తండ్రి నన్ను పంపెనని" యేసు చెప్పెను (యోహాను 6:57). యేసు "సజీవుడైన దేవుని కుమారుడైన క్రీస్తు" అని పేతురు ఒప్పుకొనెను (మత్త 16:16). ఆగొప్ప సత్యముపై క్రీస్తు తన సంఘమును నిర్మింతునని చెప్పెను. క్రైస్తవులు విగ్రహములను (1థెస్స 1:9), నిర్జీవ క్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు ప్రతిష్టించుకొనిన వారు (హెబ్రీ 9:14). మనము అస్థిరమైన ధనమునందు గాక జీవము గలదేవుని యందు నమ్మిక యుంచాలి (1 తిమో 6:17; 4:10). ఆయన యుగ యుగములు జీవించుదేవుడు (ద్వితీ 32:39).

**దేవుడొక వ్యక్తి :**

దేవుడు జీవముగలవాడు గనుక ఆయన స్పృహ (conscious) కలిగిన వాడు. ఆయన జ్ఞానముగల వ్యక్తి. ఆయన ఇచ్ఛ, చిత్తము, నడవడి, ప్రేమకలిగిన వాడు అందువలన బైబిలు నందు ఆయన ప్రేమించునని (యెషయా 55:8), ఆలకించునని (యెషయా 59:2), కృపగలవాడని (సంఖ్యా 14:18), దయ గలవాడని (నిర్గమ 34:6), జాలిగలవాడని (లూకా 6:35), క్షమించువాడని (నిర్గమ 34:7), మంచివాడని (మత్త 19:17) చదువుదుము. యివియు మిగతా దేవుని లక్షణములును ఆయన ఈ విశ్వము యొక్క మొత్తము కంటె అధికుడని, ఆయన ఈ వ్యక్తి (Entity) యని మనకు తెలియ జేయుచున్నవి.

**దేవుడు మానవుడుకాదు :**

దేవుని యొక్క ఈ లక్షణముల వలన దేవుడు మానవుని వంటి ఒక వ్యక్తేగాని, గొప్ప వాడని కొందరు భావిస్తారు. అయితే దేవుడు మానవుడా? లేక మానవుని వలె యున్నాడా? బైబిలు దేవుని వ్యక్తిగత నామవాచకమగు ఆయన అని చెప్పుచున్నది,

నిజమే. అయితే దేవుడు పురుషుడా? ఆయనకు కేవలము పురుషలక్షణములే యున్నవా? స్త్రీలక్షణములు కూడ దేవుని నుండే కలిగిన వికావా? విలియం న్యూటన్ క్లార్క్ అనునత డిట్లు వివరించాడు.

"దేవుని వ్యక్తిత్వము మానవుని వ్యక్తిత్వము కంటే సర్వోత్కృష్ట మైనందున ఆయనను వర్ణించుటకు మనపదజాలముల సరిపోవు గనుక మన కున్న భాషనే మనం వినియోగించాలి గాని అది అసంపూర్ణమైనదని మనం ఎరగాలి. అందువలన దేవుని గూర్చి మాట్లాడేటప్పుడు 'ఆయన' అనే నామవాచ కాన్ని వాడుతాం. అయితే ఆయన అనే పదం సంపూర్ణంకాదు కాదు ఏలయనగా ఆయన అన్నప్పుడు దేవుని పురుషునిగా సంబోధిం చుచున్నాము. ఆయనను ఆయన అని సంబోధించకపోతే ఇంకేమని సంబోధించ గలము? అయితే దేవుని యందు పురుషత్వ ము, స్త్రీత్వము కూడ మిళితమై యున్నాయి. పురుషలక్షణములెట్లో, స్త్రీ లక్షణములు కూడ అన్నీ అయన నుండే ఉద్భవించాయి. అన్ని రకాల మానవులందరిలో యున్న సద్గుణాలన్నీ నిత్యుడైన దేవుని లక్షణాల ప్రతి రూపమే, ఆయన నెరుగటయనగా ఆయన శక్తిని ఎరుగుటయే".

దేవుడు పురుషుడే ఏలయనగా ఆయన మన తండ్రియని కొందరు వాదించ వచ్చును. అయితే "పరలోకములో పెండ్లి చేసి కొనరు , పెండ్లికియ్యబడరు గాని పరలోకమందున్న దూతలవలె యుందురని" క్రీస్తు చెప్పిన దానిని మనం గమనించాలి (మార్కు 12:25). అయితే దూత లెట్లుంటారు? రెక్కలు గల స్త్రీల వలెయున్నట్లు అందరు చిత్రీక రిస్తారు. గాని బైబిలులో స్త్రీగా యున్న దూతను గూర్చి మనం ఎక్కడా చదు వము. సాధరణంగా దూత లందరు 'అతడు' అనేనామ వాచకంతో వర్ణించ బడ్డారు. అయితే స్త్రీ దూతలు లేరా? పరలోకంలో పెండ్లి పరమైన సంబం ధాలుండవుగాని వారు దూతలవలె యుంటారని క్రీస్తు వివరించారు. ఇంకోమాటలో మన మెరిగినట్లు దూతలకు లింగము లేదు. ఆత్మీయ సంబంధములలో పురుష డని, స్త్రీ అని లేదని అపొ.పౌలు వివరిం చాడు (గలతీ 3:28).

ఆత్మకు యెముకలును మాంసమును వుండవని యేసు వివరించారు (లూకా 24:39). అందువలన దేవుడు పురుషుడని మనం చెప్పజాలము. ఆయన మానవుడు కాదని సంఖ్యా 23:19లో చెప్పబడి యున్నది. ఆయన ఆత్మ గనుక ఆయనకు వ్యక్తిత్వము (Personality) లేదని తలంచితే అది న్యాయ బద్ధమైనది కాదు. ఆయన గురత్వాకర్షణ శక్తి, న్యూక్లియర్ శక్తివలె వ్యక్తిత్వము లేని వాడు కాదు. ఆయన సర్వశక్తి మంతుడు, సర్వాంతర్యామి, అన్ని చోట్ల ఒకే సమయ మందుండువాడు.

**దేవుడు స్వరూపము, ఆకారము గలవాడు :**
దేవునికి రూపము ఆకారము కూడ యున్నది. యోహాను 5:37 ఆయన స్వరూపమును గూర్చి చెప్పుచున్నది. ఫిలిప్పీ 2:6 ఆయన ఆకారమును గూర్చి చెప్పుచున్నది. ఇట్టి సంగతులను గూర్చి మనం చదువునప్పుడు దేవునికి మానవుని వంటి ఆకారము, స్వరూపము వున్నదని వెంటనే మనం అనుకొంటాము. చూచునట్లు దేవునికి కన్నులున్నవి (ద్వితీ 11:12), వినునట్లు చెవులున్నవి (యెష 59:1). ఆయన చేతులనుగూర్చి (59:1), ముఖమును గూర్చి (నిర్గమ 33:20), వీపును గూర్చి (నిర్గ 33:23) మనం చదువుతాము. ఆయన తన సింహాసనము మీద ఆసీనుడై యున్నట్లు మనకు వర్ణించ బడినది. "మనుష్యుడు తన స్నేహితునితో మాటలాడునట్లు యెహోవా మోషేతో ముఖాముఖిగా మాటలాడు చుండెను. అని నిర్గమ 33:11 చెప్పుచున్నది. నిర్గమ 3వ అధ్యాయములో దేవుడు మోషేకు కనబడినేరుగా అతనితో మాటలాడినట్లని పించుచున్నది. గాని దేవుడే కాదుగాని ఆయన దూతతో మోషే మాటలాడెను (అపో.కా. 7:35).

మోషేకు కనబడి అతనితో మాట్లాడినది దేవుని దూతయేయని క్రొత్తనిబంధన విపులీకరించుచున్నది. "నలువది ఏండ్లయిన పిమ్మట సీనాయి పర్వతారణ్య మందు ఒక పొదలోని అగ్ని జ్వాలలలో ఒక దేవదూత అతని కగుపడెను" (అపో.కా. 7:30). "సీనాయి పర్వతము మీద తనతో మాటలాడిన దేవదూత తోను మనపితరుల తోను అరణ్యములోని సంఘ మందు ఉండి మనకిచ్చుటకు జీవవాక్యమును తీసికొనిన వాడితడే" యని అపో.కా. 7:38 చెప్పుచున్నది.

**దేవుడు వ్యక్తిగతముగా మోషేకు అగుపడలేదు:**
దేవుడు మోషేకు నేరుగా అగుపడలేదని లేఖనభాగముల వలన మనం రూఢిగా తెలిసికొనగలము. "మీరు ఏకాలమందైనను ఆయన స్వరము వినలేదు ఆయన స్వరూపము చూడలేదు" (యోహాను 5:37). "ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు" (యోహాను 1:18). "సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, ఎవడును చూడనేరడు" (1 తిమోతి 6:16). దేవుడు అదృశ్యుడని 1 తిమో 1:17 చెప్పుచున్నది.

**ఆత్మీయ శరీరములు వేరుగా యుండును:**
దేవుడు అదృశ్యుడే అయినను పాతనిబంధనలో దేవుని ప్రత్యక్షతలన్నీ దూతల ద్వారా సంభవించినవే. అయినను దేవునికి స్వరూపము ఆకారము వున్నది. అంటే మానవునివలె ఆయన స్వరూపాకారములు స్థలాన్ని (Space) ఆక్రమించుకొనునని తలంచరాదు. ఆయన స్వరూపాకారములు మానవుని శరీరము వంటివి కాదు. దేవుని స్వరూపము, ఆకారము కలిగిన

క్రీస్తు పరలోకమును విడిచి భూలోకమునకు వచ్చినప్పుడు, మనుష్యస్వరూపాకారములను ధరించుకొనెను (ఫిలిప్పీ 2:6). ఆయన భూమి మీద యున్నప్పుడు ఆయనకు రక్తమాంసము లు గల శరీరముండెను (లూకా 24:39).

అయితే ఇక మీదట మనం ఆయనను శరీరరీతిగా ఎన్నడు ఎరుగము. అపో. పౌలు ఇట్లు చెప్పుచున్నాడు : "కావున ఇకమీదట మేము శరీరరీతిగా ఎవనినైనను ఎరుగము; మేము క్రీస్తును శరీర రీతిగా ఎరిగి యుండినను ఇకమీదట ఆయనను ఆలాగు ఎరుగము" (2 కొరింధీ 5:16). క్రీస్తుకు ఇప్పుడు ఆత్మీయ శరీరమున్నది. పౌలు ఇట్లు చెప్పుచున్నాడు "మన శరీరము ప్రకృతి సంబంధమైన శరీరముగా విత్తబడి ఆత్మసంబంధ శరీర ముగా లేపబడును, ప్రకృతి సంబంధమైన శరీరమున్నది గనుక ఆత్మసంబంధమైన శరీరము కూడ ఉన్నది" (1 కొరింధీ 15:44). గనుక ఇప్పుడు క్రీస్తుకు మహిమాన్వితమైన ఆత్మీయ శరీరమున్నది. ఆయన "మన దీన శరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గల దానిగా మార్చునని" మనకు వాగ్దానము చేయబడి యున్నది (ఫిలిప్పీ 3:21). దీనిని బట్టి మన ప్రస్తుత దీన శరీరములు భవిష్యత్తులో మనం కలిగియుండే ఆత్మీయ శరీరములలాంటివి కాదు, ఏలయ నగా అవి మార్చబడును. 1 కొరింధీ 15:51, 53లో ఇట్లు చెప్పబడియున్నది:

"ఇదిగో మీకు ఒక మర్మము తెలుపు చున్నాను; మన మందరము నిద్రించము గాని, నిమిషములో, ఒక రెప్పపాటున కడబూర మ్రోగగానే మనమందరము మార్పు నొందు దుము. బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు, మనము మార్పు పొందుదుము, క్షయమైన యీశరీరము అక్షయతను ధరించుకొన వలసి యున్నది".

పునరుత్థానమైన తరువాత మనకెట్టి శరీరముండునో మనకు తెలియదు. "మన మిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లు గానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందు మని యెరుగుదుమని" యోహాను వ్రాసాడు (1 యోహాను 3:2). పునరుత్థానములో మన ప్రస్తుత భౌతిక శరీరములు ప్రభువు యొక్క మహిమ శరీరమువలె మార్చ బడును. అది ఎట్లుండునో మనకు తెలియదు గాని మన ఆకారములు దేవుని ఆకారమువలె యుండును. ఏలయనగా క్రీస్తు లోకమునకు రాకముందు ఎట్టి మహిమను కలిగియుండెనో అట్టి మహిమతో ఆయన ఇప్పుడు మహిమ పరచబడియున్నాడు (యోహాను 17:5, ఫిలిప్పీ 2:6). గనుక దేవునికి వ్యక్తి త్వమున్నది, రూపము ఆకారమున్నది, గాని అవిమానవ రూపము, ఆకారముల వంటిది కాదు.

**దేవుడు సర్వాంతర్యామి :**

దేవుడు సర్వాంతర్యామి యే యైనను ఆయనకు స్వరూపాకారము లున్నందున స్థానికుడెట్లు కాగలడు? మానవుడు దీనిని గ్రహించుకొనుట కష్టమే గాని, దీనిని కొంతమట్టుకు వివరించుటకు వెలుగును ఉదాహరణగా మనం వినియోగించ వచ్చును. "వెలుగు నివసిం చు చోటునకు పోవు మార్గమేది" ? యని దేవుడు యోబును ప్రశ్నించారు (యోబు 38:19). యోబు దీనికి జవాబియ్య లేకపోయాడు, నేటి వరకును మానవుడు దీనికి జవాబీయ లేకున్నాడు. సూర్యుడు వెలుగునకాధారమని మనం సూచిస్తాము. అయితే సూర్యుడొక్కడే వెలుగున కాధారము కాదు. సూర్యుడు ఇక్కడ భూమి మీదను, విశ్వంలోను తన కాంతిని ప్రసరింపజేయు చున్నాడు.

అదే విధముగా దేవునికి ఒక స్వరూపము ఆకారమున్నది. పరలోకంలో ఆయనకు ఒక సింహాసనమున్నది అయినను దేవుడు అక్కడికే, ఒక్కచోటుకే పరిమితి కాలేదు. దేవుడు ఏదో ఒక స్థలమందు వుంటాడను కొనేవారికి "దేవుడు ఆత్మయై యున్నాడని" యేసు చెప్పెను (యోహాను 4:24).

## క్రైస్తవ ఆరాధనలో వాద్య సంగీతము న్యాయమా ?

"దేవుని స్తుతించుటకు దావీదు వాద్యములను పయోగించినందున మనము ఎందుకు అట్లు చేయరాదు ? అని కొందరు వాదించెదరు". దావీదు: కీర్తనలు 150:1- 6:2. సమూయేలు 6:5 స్వరమండలముతోను సితారతోను, నాట్యముతోను దేవుని స్తుతించుడి అని చెప్పబడినది.

"అయితే మనము ఆరాధనలో ఎందుకు నాట్యమాడరాదు? యూదుల ఆరాధనలో నుండి మనకు ఇష్టమైన దానినెంచుకొని, మిగిలినవాటిని విసర్జిం చుట వలన శాపగ్రస్తుడగునని యెహోవా చెప్పెను. ద్వితియో 4:1,2 యిర్మీ 11:1,3 యెషయా 8:20,22 సామెత 30: 5,6

క్రైస్తవారాధనలో దేవుడు కోరునట్టి సంగతులను ఎరుగుట మంచిది. "యూదుల ఆరాధనలో, సాంబ్రాణీ పొగలు, పశుబలులు, ప్రార్థించుట కూడ ఒక భాగమై యుండెను.

క్రైస్త వారాధనలో నైవేద్యము, దహనబలులు, ధూప ద్రవ్యములు, వాద్యములు వాయించుట, నాట్యమాడుట, క్రొత్త నిబంధనకు విరోధము.

"సీనాయి కొండమీద పది ఆజ్ఞలు గల ధర్మశాస్త్రము వ్రాయబడెను ఆ ధర్మ

శాస్త్రములో యెహోవా - మోషేతో యూదులు ఆరాధనలో వాద్యములు వాయించుటను గూర్చి చెప్పలేదు.

యెహోవా - మోషేతో చెప్పిన విధముగా మోషే కీర్తన పాడిన పాటలు వాక్యములు మోషే గ్రంధమందు సొంతముగా వ్రాసెను. ఈ కీర్తనలతో కలిపిన ధర్మశాస్త్రము యెహోవా నిబంధన మందసపు ప్రక్కన ఉంచెను (ద్వితీ 31:19-30).

దేవుని స్తుతించుటకు అహరోను సహోదరి ప్రవక్త్రి యునగు మిర్యాము తంబూరలతోను, నాట్యములతోను ...... పాడెను గదా? (నిర్గమ 15:20,21). మనము ఎందుకు అట్లు చేయరాదు ? అని కొందరు వాదించెదరు. జవాబు - మిర్యాము తంబురలతో పాడినప్పుడు పది ఆజ్ఞలు గల ధర్మశాస్త్రము అమలులోనికి రాలేదు. గనుక వారు ఏలాగు పాడిన దేవునికి సంతోషమే (రోమా 7:7,9).

సీనాయి పర్వతము దగ్గర మోషే ద్వారా ఇశ్రాయేలీయులకు మొదట ఇవ్వబడిన ధర్మశాస్త్రము ప్రారంభించి, ద్వితీయోపదేశ కాండము అంతము వరకు వాక్యము వెంబడి వాక్యము చదువుకొనుచు పోయినను, పాతనిబంధన ఆరాధనలో వాద్యములు వాడినట్లు వాక్యము కనబడదు.

మోషే తరువాత యెహోషువా నాయకత్వమున ఇశ్రాయేలీయులు కనానులో ప్రవేశించిన కాలమున ఒత్నీయేలు, ఏహూదు, షమ్గర్, దెబోరా, గిద్యోను, అబీమెలెకు, తోలాయాయీరు, యెఫ్తా, ఇబ్సాక్, ఏలోను, అబ్దోక్, సమ్సోను, ఏలీ సమూయేలు ఈ న్యాయాధిపతుల కాలము రమారమి 350 సం॥లు వీరి కాలములో ఇశ్రాయేలీయులు ఆరాధన యందు వాద్యాలు వాయించినట్లుగా వాక్యము కనబడదు.

యూదా చరిత్రలో సౌలు నుండి రాజులు కాలము ప్రారంభమగును. సౌలు 40 సం॥లు ఇశ్రాయేలీయులను పాలించెను. ఈ కాలమంతటిలో ఆరాధనలయందు సంగీత వాద్యాల నుపయోగించలేదు.

సౌలు తరువాత దావీదు గొఱ్ఱెల కాపరిగా జీవితమును ప్రారంభించెను. అతడు కళాకారుడు సితార గాన కళలలో ప్రవీణుడు (1 సమూ 16:14,23).

పితరుల యుగము, ఆదాముతో మొదలు మోషేకు సీనాయి కొండ పై ధర్మశాస్త్రము నిచ్చువరకు మధ్యనున్న కాలము 2500 సం॥లు. తరువాత 450 సం॥లకు పాత నిబంధన ఆరాధనలో వాయిద్యాలు ఉన్నట్లు కనబడుచున్నవి.

పాత నిబంధన మోషే వ్రాసిన ధర్మశాస్త్రములో లేని వాయిద్యాలు వాయించుట ఏలాగు అమలులోనికి వచ్చెను?

దావీదు రాజ్యపాలనలో ఇవి అమలులోనికి వచ్చెను... దావీదును దావీదు రాజుకు దీర్ఘదర్శియైన గాదును,

ప్రవక్తయైన నాతానును చేసిన నిర్ణయము చొప్పున యెహోవా మందిరములో తాళములను, సర్వమండలములను, సితారాలను వాయించుటకై అతడు లేవీయులను ఏర్పాటు చేసెను. (ఈ ముగ్గురు చేసిన నిర్ణయము చొప్పున) అది అమలులోనికి వచ్చెను (2 దినవృత్తా 29:25,30).

దావీదు - మీరు మీ బంధువులగు పాలకులను పిలిచి, గంభీర ధ్వని చేయుచు .. పాడునట్లు ఏర్పాటు చేయుడని, లేవీయులు అధిపతులకు ఆజ్ఞ ఇచ్చెను (1 దినవృత్తా 15:16).

"పాత నిబంధన - ఆరాధనలో వాద్యగానమునకు అవకాశమిచ్చిన వారు దావీదుగాని, దేవుడు కాడని దైవప్రేరిత వాక్యములు చెప్పుచున్నవి".

సొలొమోను నిర్మించిన మందిర ప్రతిష్టతను గూర్చి, యాజకులును. లేవీయులును, దేవుని స్తుతించుటకై దావీదు కల్పించిన యెహోవా గీతములను పాడుచు, వాద్యాలను వాయించుచుండెను. (2 దినవృత్తా 7:5, 6:1 దినవృత్తా 13:8).

ఎజ్రా ఇట్లనెను - శిల్పకారులు యెహోవా మందిరము పునాదిని వేయుచుండగా - దావీదు నిర్ణయించిన విధి చొప్పున యాజకులు బాకాలతోను, లేవీయులు చేయి తాళములతోను. యెహోవాను స్తోత్రము చేసిరి. (ఎజ్రా10: 13).

ఇటువంటి శాస్త్రులతో, పరిసయ్యులతో యేసు ఇట్లనెను. " ఈ ప్రజలు .... మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు అని చెప్పెను (మత్తయి 15:7-9).

ఆమోసు ఇట్లనెను, ఇశ్రాయేలులో పెద్దలైన వారికి శ్రమ. వారు స్వరమండలములతో ... పిచ్చి పాటలు పాడుచు - దావీదువలెనే వాయించు వాద్యములను కల్పించు కొందురు (ఆమోసు 6:1,5). చదువరీ వాద్యాలు వాయించుట వలన మీ సంగతి ఏమి ? ఆలోచించు.

క్రొత్త నిబంధన ఆరాధనలో లేని వాయిద్య సంగీతము - క్రైస్తవ ఆరాధనలోనికి ఏలాగు వచ్చినవో తెలుసుకొందము. వాటి ఆరంభరీతి నెరుగుటకు మనము బైబిలును గాక సంఘ చరిత్రను చూడవలెను. "సంగీతము అను అంశము పై బైబిలు నిఘంటువును కూడ చూడవలెను."

క్రీ॥శ॥ 670 సం॥లో పోపు వైటాలియన్ అను నతడు దక్షిణ ఐరోపాలోని కొన్ని కేథలిక్ గుడులలో ఆర్గన్ అను వాద్యమును ప్రవేశపెట్టెను. ఆర్గన్ అనగా సంగీతపు పెట్టె (మ్యూజికల్ యిన్‌స్ట్రుమెంటు అని అర్థము).

'సంఘ' సంగీతములోనికి ఆర్గన్ అను వాయిద్యమును పోపు వైటాలియన్ అను నతడు క్రీ॥శ॥ 666 సం॥లో మొట్ట మొదటిగా ప్రవేశపెట్టెను. దీనికి ముందు క్రీ॥శ॥ 33

సం॥లో యెరూషలేములో క్రొత్త నిబంధన సంఘము అనగా క్రీస్తు సంఘము ఆరంభమైనది, అపొస్తలుల ఆరాధనలో వాద్యాలు వాయించుటలేదు. (1 కొరింథీ 14:26).

మొదటి శతాబ్దపు సంఘము ఆరాధనలో వాయిద్య సంగీతము ఉపయోగించిరా ? లేదా ? అను ప్రశ్నకు జవాబు కావాలంటే క్రొత్త నిబంధనలోని 10 వాక్యభాగాలు ఈ ప్రశ్నకు జవాబు నిచ్చుచున్నవి.

క్రైస్తవ ఆరంభములో మేడగదిలోను .... ప్రభురాత్రి భోజన సందర్భములోను, దేవుని స్తుతించుచు, పాటలతో మొదటిగా చెప్పబడెను. గాని వాద్యాలు వాయించు టలేదు. (అపో.కా. 2:42,47 ). యేసు ప్రభువును - అపొస్తలులును కీర్తన పాడి ఒలీవల కొండకు వెళ్లిరి గాని వాద్యాలు వాయించలేదు (మత్తయి 26:30 మార్కు 14:26). ... మధ్యరాత్రి వేళ పౌలును సీలయు........... కీర్తనలు పాడుచుండిరి, ఖైదీలు వినుచుండిరి. (అపో.కా. 16:25).

నీనామ సంకీర్తనము చేయుదును (రోమా 15:9). పౌలు ... ఆత్మతో పాడుదును. మనస్సుతోను పాడుదును, అని చెప్పెను గానివాద్యాలు వాయించుటలేదు (1కొరింథీ 14-15), సమాజము మధ్య నీ కీర్తిని గానము చేతును (హెబ్రీ 2:12). ... మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతి యాగము చేయుదము, అనగా 'జిహ్వ' ఫలము అర్పించుదము (హెబ్రీ 13:15). ఇక్కడ వాద్యాలు లేవు - మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను, ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడవలెను. ఇక్కడ వాద్యాలు లేవు (యాకోబు 5:13) యోహాను ప్రకటన గ్రంధములో 144 వేల మంది దేవుని గొఱ్ఱెపిల్లకు పాడిన పాటను గూర్చి వ్రాసెను. ప్రకటన 14:1,5). సత్యారాధ నను గూర్చి యేసు - సమరయ స్త్రీతో ఇట్లనెను : దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యము తోను ఆరాధింపవలెను (యోహాను 4:24).

క్రైస్తవారాధనలో - పాటలు పాడుట ఒక భాగమై యున్నది, సంఘ ఆరాధనలో ఏమేమి యుండాలో వాటిని గూర్చి, పౌలు కొరింథీ సంఘములో వివరించెను. సహోదరులారా ? మీరు కూడి వచ్చునప్పుడు ఒకడు కీర్తన పాడవలెనని ... మరియొకడు బోధింపవలెనని మరియొకడు తనకు బయలు పరచబడినది ప్రకటన చేయ వలెనని మరియొకడు బోధింపవలెను .... మరియొకడు భాషతో మాటలాడ వలెనని మరియొకడు అర్ధము చెప్పవలెనని యున్నాడు. ఇందులో వాద్యాలు వాయించువారు కనిపిం చలేదు. (1కొరింథీ 14:26). యెహోవా పాడుటను గూర్చి, యోబుతో ఇట్లనెను

ఉదయ నక్షత్రములు ఏకముగా కూడి పాడినవియని యోబు వ్రాసెను (యోబు 38:7).

ఆరాధనలో వాద్యాలు వాయించు వారి ఉద్దేశము, ఎఫెసీ 5:19 కొలస్స 3:16లోని 'సంగీతము' అను పదమును చూపించి తమ వాదనతో సువార్తికులను గందరగోళ పరచుచున్నారు. సంగీతము 'వాద్యాలు' అని తలంచుచున్నారు. సంగీతము అనగా వాయిద్యములు కానేకావు.

సంగీతములో దేవుని చిత్తమును 5 విధములుగా బయలుపర్చబడి యున్నది. సంగీతముతో 1. హెచ్చరించుట, 2. కీర్తించుట, 3. బోధించుట, 4. బుద్ధి చెప్పుట, 5 స్తుతించుటయు దేవుని చిత్తమై యున్నది (ఎఫెసి 5:19 కొలస్స 3:16).

మరి సితారా స్తుతించగలదా ? కంజెర కీర్తించగలదా? హార్మోనియం హెచ్చరించగలదా ? బుల్ బుల్ సితారా బోధించగలదా? మృదంగం బుద్ధి చెప్పగలదా? ఇట్టి వాయిద్యములు దేవుని చిత్తమును నెరవేర్చవు. అవి నిర్జీవ వస్తువులు. ఇట్టి నిర్జీవ వస్తువులతో గాక నాలుకతో స్తుతి అర్పించవలెను. (హెబ్రీ 13:15).

కొందరు ఆరాధనలో వాద్యాలు వాయించుదురు, చప్పట్లు కొట్టుదురు, రకరకాల శబ్దములు చేయుదురు. మనం ఆరాధన ఎందుకు చేయుచున్నాము? మనుష్య లను సంతోషపెట్టుటకా లేక దేవుని సంతోష పెట్టుటకా? వారు ఆలోచించరు. డప్పులు కొట్టుట, చప్పట్లు కొట్టుట, ఈ రెండు సమాన ప్రభావాన్నే కలుగజేస్తాయి. ఈ రెండు సందర్భాల్లోను పాటలు ... హృదయములో గానము చేయుటకు బదులు ఒకడు ఏదో ఒక దానిని కొట్టుచు శబ్దములు చేయుచున్నాడు. చప్పట్లు కొట్టుటవలన ఉద్వేగభరితులగుదురు. ఆ శబ్దమువలన పాటలు, మాటలు వినబడవు, ఇంతకి మిగిలేది చప్పట్లు తప్ప యేమీ ఉండదు, యిది దేవుడు కోరు సంగీతము కాదు.

దేవుని ప్రజలు పాటలు పాడుచు, చప్పట్లు కొట్టుచు దేవుని ఆరాధించునట్లు క్రొత్త నిబంధనలో ఎక్కడ వాక్యము కనబడదు ఇవన్ని మానవ కల్పితములే, దేవుని అనుమతి లేకుండా ఆరాధనలో చేర్చబడినవే (మత్తయి 15:9).

వాయిద్యాలు ఉల్లాసము కలిగించును గదా అవి ఉంటే తప్పేమి అని కొందరు వాదింతురు : జవాబు – మనము ఉల్లాసము కొరకు దేవుని ఆలయమునకు పోవుటలేదు దేవుని ఆరాధించుటకు పోవుచున్నాము, మన ఆరాధన భయభక్తులతో కూడినదై యుండవలయును (కొలస్స 2:18-19) (ప్రసంగి 5:1,3).

వాయిద్యాలు యొక్క ప్రభావము అది బాహ్య ప్రేరణ; అది ఆత్మీయమైనది కాదు. అని నిర్జీవనాదమని బైబిలు చెప్పుచున్నది. ఆయనకు .....ఏదైనను కొదువ యున్నట్టు మనుష్యుల చేతులలో సేవింపబడువాడు

కాదు (అపొ.కా. 17:25). క్రొత్త నిబంధన లోనున్న వాక్యములు ప్రకారము అరాధించని క్రైస్తవుడు శాపగ్రస్తుడగును (గలతీ 1:6,10 ప్రకటన 22: 18,19).

పౌలు ఇట్లనెను....సంఘముల ...టిలో దేవుడు సమాధానమునకే కర్త గాని అల్లరికి కర్త కాదు. (1కొరింథీ 14:33). అల్లరితో కూడిన ఆట పాటలు యందు నడుచుకొనవద్దు అని చెప్పెను (1 పేతురు 4:3 యాకోబు 3:16,18 గలతీ 5:19,21). దేవదూతల అరాధన యందు ఇచ్ఛకలిగి యుండకుడి (కొలస్స 2:18,23 ప్రసంగీ 7:5,6).

చదువరీ : ఈ క్రైస్తవ ఆరాధన యొక్క ప్రత్యేకతను, పవిత్రతను గుర్తిస్తావని నా ఆశ:- క్రీస్తును ఆశ్రయించే అనేకులు అబద్ధబోధలు యందు లక్ష్యముంచి, విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు (1 తిమో 4:1,2, 1:3,4) . పేతురు ఇట్లనెను మీలోను అబద్ధ బోధకులుందురు వారు అధిక లోభులై, కల్పనా వాక్యములు, భిన్నాభి ప్రాయములను రహస్యముగా బోధించుదురు. అనేకులు వారి పోకిరి చేష్టలను, అనుసరించి నడుతురు, వీరిని బట్టి సత్యమార్గము దూషింపబడును (2 పేతురు 2:14, 1 యోహాను 4:1, తిమోతి 6:3,8 ఆమోసు 6:5,2 తిమోతి 2:1-4,16, 3:16,17).

క్రైస్తవ ఆరాధనలో వాయిద్య సంగీతము మానవుల నుండియే కలిగిన దని మనకు స్పష్టమగు చున్నది. చదువరీ మీ సంగతీ ఏమి? ఆలోచించు .

- వై . తాతారావు
క్రీస్తు సంఘము, బరంపురం

మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.
- ఎడిటర్

# క్రొత్త నిబంధన సంఘము దాని ఆరాధన

మొదటి శతాబ్దము నుండి కూడ యేసుక్రీస్తును ఆయన అపొస్తలును సంఘమునకు ఉద్దేశించిన ఆరాధన క్రమము నుండి జనులు తొలగిపోయిరి. ప్రజలు దేవునికి తమ యిష్టము వచ్చిన సంగతులను అర్పించుచున్నారు. కొందరు నాటికలను, సంగీత కచేరీలను, వాద్యములను, క్రిస్మసు, ఈస్టరు అను పండుగలను దేవునికి సమర్పించు చున్నారు. అయితే ఇవన్నీ చేయుటకు బైబిలు ఎక్కడ అనుమతినిచ్చుచున్నది? యనే ప్రశ్నను మనం అడగవచ్చు.

బైబిలులో సూక్ష్మమైన ఆరాధనను మొదటి శతాబ్దములో ఆరంభమైన సంఘములో మనం చూడవచ్చు. వారి ఆరాధన అంతయు చాలమట్టుకు గృహాలలో జరిగేది (అపొ.కా.2:46, 1కొరింథీ 16:19). సంఘచరిత్ర యొక్క ప్రసిద్ధ ఆదిమ లేఖకులు సంఘారాధన సూక్ష్మమైనదనుటలో ఏకీభావము కలిగియున్నారు. ఆరాధనలో వారు ప్రార్థన, పాటలు, వాక్యోపదేశము, ప్రభురాత్రి భోజనము, కానుకలు యిచ్చుట చేసేవారని చరిత్రకారులు చెప్పుచున్నారు.

'బైబిలు మాట్లాడుచోట మేము మాట్లాడుదుము, బైబిలు మౌనియైన చోట మేము మౌనముగా యుందుము' అను విజ్ఞాపన అనేకులను ఆకర్షించుచున్నది. దేవుని వాక్యము 'నాపాదములకు దీపమును నాత్రోవకు వెలుగునైయున్నది.' గనుక క్రీస్తు సంఘము బైబిలును మాత్రమే వినియోగించుటను బట్టి అనేకులు అభినందించుచున్నారు.

చాలకాలము నుండి ఆరాధనలో మానవ కల్పిత పద్ధతులు, సిద్ధాంతములు మిళితమై పోయాయి గనుక దైవారాధనలోని సూక్ష్మీయతను ప్రజలు గ్రహించుకొనలేక పోయారు. ఆరాధనలోనికి ఆచార కర్మలనే కములను మానవులు ప్రవేశపెట్టుటచే అనేకులు బైబిలును గ్రహించుకొనలేమనే నిర్ధారణకు వచ్చేసారు. గనుక దానిని చదివి పరీక్షించుకోవడం మరచిపోయారు.

బైబిలు ఇట్లు చెప్పుచున్నది. 'దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది.' (2తిమో 3:16-17). అందువలన ప్రతి విషయములోను మనం లేఖనములు చెప్పుచున్నట్లే చేయాలి.

## మీ కొక గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును . గాని మీరు 85/- రూ॥లు మాత్రమే. మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిలు విద్యార్థులకు, బోధకులకు, తర్భీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి:

***Satya Vani***

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. VM/KD/02/2009-2011**

**To**

From:

**SATYA VAKKU**

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication. Sambhamurthy St. Kakinada - 533 001